తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం
19 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :



# పూలజాతరతో పులకించిన గూడూరు

○ఘనంగా బతుకమ్మ వేడుకలు ○ఆడిపాడిన మహిళామణులు, యువతులు



**తల్లాడ, (జనంసాక్షి) :** రంగురంగుల పూల సోయగాలు.. లయబద్ధమైన చప్పట్ల చప్పుళ్లు.. ఆడపడుచుల పాటల సందడితో తల్లాడ మండలంలోని గూడూరు గ్రామం ఆదివారం పులకించిపోయింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గ్రామ మహిళలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను తీర్చిదిద్దిన మహిళలు, సాయంత్రం వేళ గ్రామంలోని ప్రధాన కూడలికి తరలివచ్చారు. పట్టుచీరలు, సంప్రదాయ వస్త్రధారణతో వచ్చిన యువతులు, మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో" అంటూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. వారి నృత్యాలు, జానపద గీతాల ప్రతిధ్వనులతో గ్రామంలో పండుగ శోభ వెల్లివిరిసింది. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి, ప్రత్యేక పూజలు ఆచరించి భక్తిప్రపత్తులతో గంగమ్మ ఒడికి చేర్చారు. ఒకరికొకరు వాయనాలు ఇచ్చుకుంటూ సద్దులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువతీయువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.





# గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ..



**భద్రాచలం అక్టోబర్ 18 (జనంసాక్షి)** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సూచించారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల సమావేశ మందిరాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని శాఖల యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఆదేశించారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని సూచించారు. స్వీకరించిన అర్జీలపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకునేలా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):** దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మున్సిపల్ కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తుల రమేష్, విగ్రహ దాత శ్రీకమల హాస్పిటల్ బొలగాని బిక్షపతి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని 42వ వార్డులో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరుకుపల్లి వెంకటరమణ, బొమ్మిడి మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి ఆయురారోగ్యాలు, అభివృద్ధితో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని అన్నారు.దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో సట్టు శంకర్, సుధాకర్, ఉమాకాంత్,సాయి, శంకర్, జీవన్, పవన్, చరణ్, మహేష్, మధు, నరేష్,మధు, జానీ,రాము, నాగరాజు, సైదులు, పరమేష్, చార్విక్,సాత్విక్, గ్రీష్మ, సహస్ర, స్మైలీ, ఉత్సవ కమిటీ సభ్యులు,ఆదర్శ యూత్ కమిటీ సభ్యులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సద్దుల బతుకమ్మ సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీతాజగదీష్ రెడ్డి బతుకమ్మను పేర్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ ఆడపడుచులందరూ చిన్న పెద్ద అనే తేడా లేకుండా సంతోషంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఉప్పల లలిత ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి సర్పంచ్ అండ.. రూ.7 వేల ఆర్థిక సహాయం

అకాల మరణం పట్ల సంతాపం.. బాధిత కుటుంబానికి పరామర్శ

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 18 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ధారంగుల భద్రయ్య అకాల మరణం పట్ల గ్రామ సర్పంచ్ తూటిపల్లి సత్తెమ్మ నాగేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.భద్రయ్య కుమారుడు ధారంగుల రమేష్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ.7,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అదే విధంగా గ్రామానికి చెందిన యాదగిరి తన వంతు సహాయంగా 5000 రూపాయలు సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో పి.ఏ.పల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు,పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ తూటిపల్లి సత్తెమ్మ నాగేష్‌తో పాటు ఉపసర్పంచ్ గిరి,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,యువత పాల్గొన్నారు.



# అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి

**తుంగతుర్తి అక్టోబర్ 18 (జనం సాక్షి)** అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్తగూడెం టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది, స్థానిక ఎస్సై ఆర్ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తగూడెం గ్రామానికి చెందిన కంచం సందీప్(28) అనే వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు సమాచారం తమకు అందిందని తెలిపారు, ఈయన జాతీయ రహదారి కొత్తగూడెం గ్రామ సమీపంలో గల ఉన్న టోల్గేట్ వద్ద డబ్బా ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు, ఈ మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు, మృతదేహానికి సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలను చేపట్టి, మృతికి గల కారణాలను నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు, అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు సేకరించడం, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో అవసరమైన ఆధారాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు, ఈ ఘటనపై నిర్ధారణ కాని వార్తలు, వదంతులను ప్రచారం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు, మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిపారు, త్వరలో నిందితులను పట్టుకుని చట్టరీత్యా శిక్షించనున్నట్లు తెలిపారు



జనంసాక్షి

# కొప్పోలు నవరాత్రి వేడుకల్లో పిజిఆర్ సందడి

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు.. చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

**గుర్రంపోడు అక్టోబర్ 18 (జనంసాక్షి)**
గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో వైభవంగా కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పిజిఆర్ పాల్గొని సందడి చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కొప్పోలు గ్రామానికి చేరుకున్న ఆయన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాలు, భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పిజిఆర్ పరిశీలించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. అమ్మవారి కృపతో కొప్పోలు గ్రామంతో పాటు నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి అండ**
కొప్పోలు గ్రామంలోని పురాతన చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి పిజిఆర్ తనవంతు సహకారం ప్రకటిం చారు. ఆలయ అభివృద్ధి పనులకు విరాళం అందించనున్నట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పిజిఆర్ విరాళం ప్రకటించడంతో గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఘనంగా సన్మానం,అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పిజిఆర్ను ఘనంగా సన్మానించారు. ఈ



సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న పిజిఆర్కు గ్రామస్తులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

**కనగల్లు, అక్టోబర్ 18 (జనంసాక్షి)**
మండలంలో పోనుగోడు గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న(మల్టీపర్పస్ వర్కర్లు)కార్మికులకుపులకరము అండాలు వెంకటేశం దుస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అండాలు వెంకటేశం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పారిశుద్ధం, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రతలు నిరంతరం శ్రమించే కార్మికులకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోస నిచ్చారు. అనంతరం గృహ అవసరాల కిట్లను కూడా ఈ సందర్భంగా కార్మికులకు కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తగుళ్ల రాధిక, వార్డు సభ్యులు మల్లెపల్లి పిచ్చయ్య, బొమ్మరబోయిన లక్ష్మయ్య, పులకరం శ్రీలత అశోక్, జీ యడవల్లి సొసైటీ డైరెక్టర్ పులకరం మల్లయ్య, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధన సమితి రిలే నిరాహారదీక్షలకు విరామం

## పండుగలు, ఉద్యమ కార్యాచరణ కోసం కొద్ది రోజులు వాయిదా

**సూర్యాపేట (జనంసాక్షి):**
బుల్లెట్ ట్రైన్ రైల్వే కారిడాడార్ సాధన లక్ష్యంగా గత 90 రోజులుగా కొనసాగుతున్న పలు ఉద్యమ రూపాలలో, ఉద్యమంలో భాగంగా 65 రోజులుగా రిలే నిరాహార దీక్షలకు కొద్ది రోజులు విరామం ప్రకటిస్తున్నట్లు బుల్లెట్ ట్రైన్ సాధన కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి తెలిపారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని పెద్దిరెడ్డి రాజా నివాసంలో జరిగిన ఉద్యమ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ఆడబిడ్డలకు ప్రియమైన బతుకమ్మ, తెలంగాణ ప్రజలకు పెద్ద పండుగ దసరా,దీపావళి పండుగల సందర్భం, రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర రైల్వే మంత్రిని కలిసి బుల్లెట్ ట్రైన్ అలాట్మెంట్ జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇచ్చేందుకు కమిటీ ఆధ్వర్యంలో వెళ్లాల్సి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమాల కారణంగా దీక్షలు కొద్ది రోజులు వాయిదా వేయాలని ఉద్యమ సమన్వయ కమిటీ తీర్మానించినట్లు తెలిపారు.రాష్ట్ర



ముఖ్యమంత్రి, కేంద్ర రైల్వే మంత్రి స్పందించిన తీరును బట్టి ఉద్యమ కార్యారణ విధి విధానాలపై త్వరలో ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు.జిల్లా ప్రజల ఆకాంక్ష, ఉద్యమ కమిటీ నిర్ణయాలను అర్థం చేసుకొని త్వరలో ప్రకటించే ఉద్యమ కార్యాచరణ కు సహకరించి బుల్లెట్ ట్రైన్ సాధించడమే లక్ష్యంగా కొనసాగే ఉద్యమంలో జిల్లా ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా, రమణాచారి, ధర్మార్జున్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్,చలమల్ల నరసింహ, కొత్తపల్లి శివకుమార్, బూర వెంకటేశ్వర్లు, వెలుగు వనిత, జర్నలిస్టు భూపతి రాములు, మట్టిపెల్లి సైదులు, కొనుకుంట్ల సైదులు, నేరెళ్ల మధు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాళరాత్రి దేవి అలంకారంలో దర్శనం

**వలిగొండ, అక్టోబర్ 18 (జనంసాక్షి)**



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం మండల కేంద్రంలోని త్రిశక్తి క్షేత్రంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు కాళరాత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో పాటు లలితా పారాయణం, లక్ష పుష్పార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిన్నూరి గోపాలకృష్ణ, కమలాకర్ శర్మ, అనురాధ మనోహరి, శ్రీనివాస్ గుప్త, దత్తాత్రేయ శర్మ, ప్రమోద్ ముక్కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరెగూడెంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

### ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన దైద రవీందర్

**చిట్యాల, అక్టోబర్ 18 (జనం సాక్షి):**
చిట్యాల మండలంలోని ఆరెగూడెం గ్రామం సర్పంచ్ నాగంపల్లి శ్యామ్ ఆహ్వానం మేరకు నిర్వహించిన శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, పెద్దకాపర్తి మాజీ సర్పంచ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కందమళ్ల శిశుపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగంపల్లి కిషోర్, ఆరెగూడెం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, బోయపల్లి వెంకన్న గౌడ్, పెద్దకాపర్తి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు లింగస్వామి, యువ నాయకుడు అరుణ్, వెంకన్న, దశరథ, రాములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు. భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

**రామన్నపేట, అక్టోబర్ 18 (జనంసాక్షి):**
రామన్నపేట మండలం వెల్లంకి గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ దసరా సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున దుస్తులు, ఇతర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉండటానికి మురుగునీటి వ్యవస్థ నిర్వహణ, గ్రామంలో ప్రతి ఇంటికి నల్లాల ద్వారా నీటి పంపిణీ మొదలగు విషయాలలో గ్రామపంచాయతీ సిబ్బంది పాత్ర అద్భుతమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సండ్ల లింగయ్య, జువ్వ గోని మల్లమ్మ, శ్రీ మిర్యాల జగన్, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఫ్లెక్సీలు చించితే సేవా కార్యక్రమాలు ఆగవు మరింత విస్తరిస్తాం మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ టీం

### సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం తగదు: సర్పంచ్ ధనలక్ష్మి చందర్ గౌడ్



**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి :**
మండల కేంద్రంలో మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ అన్నారు. దసరా, దీపావళి పండుగల శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అక్టోబర్ 16 అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఫౌండేషన్ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫ్లెక్సీల ధ్వంసానికి నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్మీట్లో సర్పంచ్ మాట్లాడారు. "మానవసేవే మాధవసేవ" అనే నినాదంతో మబ్బు మహేష్ ఫౌండేషన్ను స్థాపించి ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. సమాజ సేవ కోసం ముందుకొచ్చే వారిని ప్రోత్సహించాలే తప్ప, ఇలాంటి చర్యలతో నిరుత్సాహపరచడం సరికాదన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మబ్బు మహేష్ చేస్తున్న సేవలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం**
ఎలాంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న మబ్బు మహేష్పై కొందరు ఎందుకు వ్యతిరేకత చూపుతున్నారో అర్థం కావడం లేదని ఫౌండేషన్ బృందం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్నవారికి తక్షణమే అండగా నిలుస్తూ ఫౌండేషన్ సేవలు అందిస్తోందని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలను చించివేసిన ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, సత్తయ్య, ఎండీ షానూర్, వీరస్వామి, కానుకోట్ల మహేష్, గట్టు శాంతికుమార్, లింగస్వామి, మల్లయ్య, గడ్డం శౌరి, గడ్డం ఎంకన్నతో పాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై సాయినాథుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి

○పత్రికల ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలి..

○ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ..



**చింతపల్లి, అక్టోబర్ 18(జనంసాక్షి)**
చింతపల్లి మండల కేంద్రంలో కొలువుదీరిన సాయినాథుని 108వ పుణ్యతిథి ఉత్సవాలు, శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా జర్నలిస్టు సోదరులకు సాయినాథుని ఆశీస్సులు అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ, భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలను ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ అభినందించారు. జర్నలిస్టుల సేవలు అభినందనీయం.. సాయినాథుని ఆశీస్సులు అనంతం!ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ మాట్లాడుతూ.. సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాయినాథుని పుణ్యతిథి ఉత్సవాలు, శరన్నవరాత్రి వేడుకలను పత్రికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఆలయంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్న జర్నలిస్టు సోదరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా సాయినాథుని ఆధ్యాత్మిక కార్యక్రమాలను పత్రికల ద్వారా ప్రజలకు చేరవేయాలని ఆయన కోరారు. జర్నలిస్టులందరిపై సాయినాథుని కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, వారి కుటుంబాలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సాయినాథుని సేవలో భాగస్వాములవుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న ప్రతి ఒక్కరికీ బాబా ఆశీస్సులు లభించాలని ప్రార్థించారు. భక్తి, సేవ, ఆధ్యాత్మికతతో సమాజంలో సానుకూల వాతావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమిరిశెట్టి వెంకటయ్య, పుల్లారెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, కమిటీ సభ్యులు, పత్రికా మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.





సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ లో గల శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రోత్సవాలలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని పాల్గొనాలని కోరుతూ ఆహ్వానించిన దేవాలయ కమిటీ సభ్యులు

## దుర్గామాత సన్నిధిలో మహా అన్నదానం



**కనగల్లు, అక్టోబర్ 18 (జనంసాక్షి)**
మండలంలోని పలు గ్రామాలలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పొనుగోడు భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భవాని మాల ధారణ స్వాములు పాల్గొన్నారు.

## దుర్గా దేవి అలంకరణలో శ్రీ విజయ దుర్గాదేవి

### అత్యంత వైభవంగా చండీ హోమం

**నేరేడుచర్ల అక్టోబర్ 18 (జనంసాక్షి) :**



దేవి నవరాత్రి దసరా వేడుకలలో శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారు శ్రీ దుర్గా దేవి అలంకరణలో ఆదివారం దర్శనమిచ్చారు..నేరేడుచర్ల పట్టణంలోగల శ్రీ విజయదుర్గ దేవి ఆలయం,శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయం లో ఎనిమిదవ రోజు శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని అగ్ని ప్రతిష్ట ఆవాహిత దేవతా సహిత శ్రీ చండి సప్త శత హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు భక్తులతో సందడిగామారాయి. ఆలయ అర్చకులు, లుగుశ్రీనివాసాచార్యులు,ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజ నిర్వహించారు.నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు..దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా,అమ్మవారి దర్శనం కనులారా తిలకించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కొనతం ఆదిరెడ్డి, కొనతం చిన్న వెంకటరెడ్డి, హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు దంపతులు నాగండ్ల శ్రీధర్, కొనతం కృష్ణారెడ్డి, సూరిబాబు, నోముల మల్లేశం, ఆకారపు వెంకటేశ్వర్లు, తాళ్ల సురేష్ రెడ్డి,గణేష్ రెడ్డి, సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, స్వామి, సురేష్,మెడిసిన మెట్ల శివ, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, బెల్లంకొండ శేఖర్, కొనతం రామిరెడ్డి, కొనతం శ్రీనివాస్ రెడ్డి దంపతులు, గరినే సతీష్, బాలెన సైదులు, మచ్చ శ్రీను దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సిరిపురంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**రామన్నపేట, అక్టోబర్ 18 (జనంసాక్షి):**



మండలంలోని సిరిపురం గ్రామంలోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శ్రీ దుర్గా దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ విశేష పూజా కార్యక్రమాలను కట్ట ప్రభాకర్ రెడ్డి-మాధవి దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజ,నవగ్రహ పూజ,స్వామివారికి శ్రద్ధాభక్తులతో అభిషేకం, హోమ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో సిరిపురం శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు రమేష్,దాసిరెడ్డి వెంకటరమణ,ఆలయ అర్చకులు జెల్లా అంజయ్య, గోపాలచార్యులు, అప్పం రాములు శాస్త్రి,చెన్నోజు సత్యనారాయణ, ఉపేంద్ర చారి, సింగం వినయ్ కుమార్,జెల్లా సాయికుమార్,సిల్వేరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**నేరేడుచర్ల అక్టోబర్ 18 (జనంసాక్షి) :**



అంగరంగ వైభవంగా చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు, పట్టణంలో తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా ముగిశాయి. తీరొక్క పూలతో మహిళలు, బంతి, చేమంతి,గునుగు,తంగేడు వంటి రకరకాల ప్రకృతి సహజ పూలతో బతుకమ్మలను వలయాకారంలో అత్యంత అందంగా తీర్చిదిద్దారు. సద్దుల నైవేద్యం ఈ రోజున ఐదు రకాల ప్రత్యేక నైవేద్యాలు (సద్దులు) సమర్పిస్తారు. ఆటపాటలు, ఊరేగింపు సాయంత్రం వేళ మహిళలంతా కొత్త బట్టలు ధరించి, బతుకమ్మల చుట్టూ కోలాటాలు ఆడుతూ సంప్రదాయ పాటలతో సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా సమీపంలోని చెరువులు, కుంటలు లేదా నదుల వద్దకు తీసుకెళ్లి పోయిరా గౌరమ్మా అంటూ గంగమ్మ ఒడికి చేర్చారు. అనంతరం తాము తెచ్చిన సద్దులను ఒకరికొకరు పంచుకున్నారు.

## ప్రమాద బాధితుడికి సర్పంచ్ విక్రమ్ ఆర్థిక సాయం

**రామన్నపేట , అక్టోబర్ 18 (జనంసాక్షి):**
రామన్నపేట మండల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, పరిస్థితి విషమంగా ఉన్న ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన బాణాల గోపాల్ కుమారుడు రోహిత్‌ను గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పరామర్శించారు. రోహిత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రమాదంలో గాయపడిన రోహిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్ విక్రమ్‌ను పలువురు అభినందించారు.



## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

### అందజేసిన మండల పార్టీ ఉపాధ్యక్షులు బోడిగే ఆనంద్ గౌడ్

**చౌటుప్పల్ అక్టోబర్ 18( జనంసాక్షి)**



ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాతరాజు వెంకటేష్ కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బోడిగే ఆనంద్ గౌడ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ.. రూ. 5,000 నగదు మరియు 50 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటామని, వెంకటేష్ కుటుంబానికి పార్టీ పరంగా ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చేవెల్లి శివకృష్ణ, బొడిగె గణేష్, దేశగోని రమేష్ యాదవ్, చేకూరి ప్రవీణ్ గౌడ్, దేశగొని సురేష్ యాదవ్, యాట వెంకటేష్, బాతరాజు కృష్ణ, భాతరాజు రమేష్ తదితర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబర్ 18( జనంసాక్షి)**
తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలు, కోలాహాలంతో జరుపుకున్నారు. ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా, అర్వపల్లి లోని దేవాలయం రోడ్డులో సద్దుల బతుకమ్మను ఆటపాటలతో గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి, అనంతరం సమీపంలోని కుంట (చెరువు) వద్దకు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని వివిధ గ్రామాలలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, యువకులు, మహిళలు సంతోషంగా పాల్గొన్నారు.



# మానవత్వాన్ని చాటుకున్న ఎస్సై రావుల నాగరాజు

నూతనకల్ అక్టోబర్ 18( జనం సాక్షి) గుండ్లసింగారం కత్వలో ఒక యువకుడు ఈత కోసం దిగి మునిగిపోయిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ ఐ నాగరాజు స్వయంగా కత్వలోకి దిగి సుమారు గంట పాటు నీటిలో వెతికి యువకుని మృత దేహాన్ని వెలికి తీయడం జరిగింది. మృతుడు కడారి భాను ప్రకాష్ తండ్రి కుమారస్వామి వయస్సు 24 సంవత్సరాలు కులము ఎస్సీ మాదిగ జనగామ జిల్లా ఇసునూరు గ్రామానికి చెందిన వ్యక్తి బతుకమ్మ దసరా పండగ సందర్భంగా చుట్టాల ఊరుకి అని వచ్చిన సందర్భంలో ప్రాజెక్టు వాటర్ ఫాల్స్ చూడడానికి రాగా జారి నీటిలో పడడం జరిగిందని ఎస్సై నాగరాజు తెలిపారు



తక్షణమే పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పిటల్ కి మృతదేహాన్ని తరలించడం జరిగింది. అని ఎస్సై నాగరాజు తెలిపారు. పోలీసు సిబ్బంది రక్షణ కోసమే కాదు అని పోలీసులలో మానవత్వం కూడా ఉంటుంది అని నూతనకల్ ఎస్సై నాగరాజు మరియు పోలీసు సిబ్బంది నిరూపించారు. ఎస్ఐ నాగరాజు మరియు పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ

**నూతనకల్ అక్టోబర్ 18( జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బతుకమ్మ పండుగ ఆశ్వయుజ మాసంలో జరుపుకుంటారు. బతుకమ్మ తయారీకి ముఖ్యంగా తంగేడు గునుగు బంతి చామంతి పూలతో పేర్చి పసుపుతో గౌరమ్మని చేసి గౌరీదేవిని పూజిస్తారు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పాటలతో బతుకమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ మహిళలు యువతులు ఉత్సాహంతో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా మహిళలు సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు, చివరి రోజు సద్దుల బతుకమ్మ కావడంతో పల్లె పట్టణాలు తేడా లేకుండా తెలంగాణ రాష్ట్రంలో పువ్వులతో చేసే అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ పండుగ తీరక పూలతో పేర్చిన బతుకమ్మను చెరువులు కుంటలు వాగులలో నిమజ్జనం చేయడం వలన ఆ నీటి శుద్ధి అవుతుందని తత్ఫలితంగా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు మహిళలు చెబుతున్నారు. ఈ కార్యక్రమాలలో వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు, పౌరులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**హుజూర్‌నగర్, అక్టోబర్ 18 (జనంసాక్షి):**

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు హుజూర్‌నగర్ పట్టణంలోని లక్కవరం రోడ్డులో ఆర్డీ గణపతి యూత్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకల్లో భాగంగా చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకను మహిళలు అత్యంత వైభవంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మ లను పేర్చి సాయంత్రం బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. పూలతో అలంకరించిన బతుకమ్మలను మధ్యలో ఉంచి కోలాటం, బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు సందడి చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు సంప్రదాయ దుస్తుల్లో



పాల్గొని వేడుకలను మరింత శోభాయమానం చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డలకు ఆత్మగౌర వానికి ప్రతీక అని, ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ అని పలువురు మహిళలు ఈ సందర్భంగా తెలిపారు. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ ముగింపు వేడుకగా సద్దుల బతుకమ్మను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో 11వ వార్డు కౌన్సిలర్ పులిచింతల వెంకటరెడ్డి, ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# చంద్రు నాయక్ కుటుంబానికి గోలి యాదగిరి పరామర్శ

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బిల్యా నాయక్‌కు ప్రగాఢ సానుభూతి**

గుడిపల్లి,అక్టోబర్ 18 (జనంసాక్షి ):

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బిల్యా నాయక్ సోదరుడు చంద్రు నాయక్ నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సీఎస్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ గుడిపల్లి మండల నాయకుడు గోలి యాదగిరి వారి కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రు నాయక్ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న గోలి యాదగిరి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బిల్యా నాయక్‌ను పరామర్శించి,కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి కలిగిన తీరని లోటు పట్ల విచారం వ్యక్తం చేస్తూ,ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ గుడిపల్లి మండల నాయకులు,ఎస్టీ సెల్ నాయకులు రమావత్ మధుసూదన్ నాయక్,రమావత్ బాలు నాయక్,గజ్జల మధుసూదన్ రెడ్డి,పార్టీ నాయకులు,కార్యకర్తలు,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**వేడుకలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు**

**తుంగతుర్తి, అక్టోబర్ 18 (జనం సాక్షి)**



సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి గౌరమ్మ తల్లితో బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను అలంకరించి గౌరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ పల్లెల్లో పూల పండుగ సందడి నెలకొంది.

# మండల వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

తుంగతుర్తి అక్టోబర్ 18 (జనం సాక్షి)

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పల్లె సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో గ్రామాల్లో సందడి చేశారు. సాయంత్రం వేళ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, గ్రామపంచాయతీ కార్యాల యాలు, దేవాలయాల ప్రాంగణాలు బతుకమ్మలతో కళకళలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి బతుకమ్మలను మధ్యలో ఉంచి చప్పట్లు కొడుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడారు. చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రకాల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం సద్దుల బతుకమ్మకు ప్రత్యేక పూజలు



నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ మహిళల ఐక్యతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీక అని పలువురు మహిళలు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ రావు సూచనలతో ఎస్సై క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పలుచోట్ల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఊరూరా బతుకమ్మల సందడి.. పల్లెపల్లెనా పూల పరిమళం.. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ సద్దుల బతుకమ్మ వేడుకలు కన్నుల పండువగా సాగాయి.

# గరుడ రమేష్ నిబద్ధతకు గుర్తింపు..

**32వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం..**

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా.. గరుడ రమేష్**

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 18(జనంసాక్షి)**



కాంగ్రెస్ పార్టీ పట్ల చూపుతున్న నిబద్ధత, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యానికి గుర్తింపుగా గరుడ రమేష్‌కు కీలక బాధ్యత లభించింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గరుడ రమేష్ కు ఆదివారం కీలక గౌరవం దక్కింది .ఆదివారం స్థానిక జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నియామకాల కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు కిషోర్ 32వ వార్డు అధ్యక్షుడిగా గరుడ రమేష్ నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా గరుడ రమేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం తనపై మరింత బాధ్యతను పెంచిందని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.తన నియామకానికి సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డికి ఈ సందర్భంగా గరుడ రమేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గరుడ రమేష్ నియామకంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ఆయన మరింత చురుకుగా పనిచేస్తూ పార్టీకి సేవలందించాలని ఆకాంక్షించారు.

# రైస్ మిల్లు కార్మికుల వేతనాలు, అలవెన్సులు పెంచాలి

**టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : శీతల రోషపతి**

**హుజూర్‌నగర్, అక్టోబర్ 18 (జనంసాక్షి):**

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, దినసరి కూలీల వేతనాలు, అలవెన్సులు పెంచాలని టిఎన్ టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి రైస్ మిల్లుల యాజమాన్యాలను కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ మార్కెట్ యార్డులో తురక రమేష్ అధ్యక్షతన నిర్వహించిన రైస్ మిల్లు కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైస్ మిల్లు డ్రైవర్ల రెండేళ్ల వేతన ఒప్పందం ఈ నెల 31వ తేదీతో ముగియనుండగా, దినసరి కూలీల ఒప్పందం డిసెంబర్ 31తో ముగియనుందని తెలిపారు. రెండేళ్లకోసారి వేతనాలు, అలవెన్సులు పెంచాల్సి ఉన్నందున కార్మికులందరూ చర్చించి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా యాజమాన్యాలకు తమ కోర్కెల వినతిపత్రం అందించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కిలో బియ్యం ధర రూ.40 నుంచి రూ.80 వరకు పెరిగిందని, వంటనూనెతో పాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు సైతం విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. ధరల పెరుగుదలతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. యాజమాన్యాలు స్పందించి కార్మికుల వేతనాలు, అలవెన్సుల పెంపు సమస్య లను పరిష్కరించేందుకు ముందుకు రావాలని కోరారు.



ఈ సమావేశంలో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష , కార్యదర్శులు గుండెబోయిన వెంకన్న యాదవ్, కంకణాల రామయ్య , తురక రమేష్ , వెంకన్న, స్వరూప, నాగమణి, నాగరాజు, శ్రీనివాస్, జానకిరావు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ సిబ్బందికి పీపీఈ కిట్ల పంపిణీ

**నేరేడుచర్ల అక్టోబర్ 18( జనంసాక్షి) :**

నేరేడుచర్ల పురపాలక సంఘం కార్యాలయం నందు విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి పీపీఈ కిట్లను పంపిణీ చేశారు.విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత రక్షణ, ఆరోగ్య భద్రత దృష్ట్యా చైర్మన్ కొనతం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పీపీఈ కిట్ల పంపిణీ జరిగింది. ఈ కిట్లలో దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె, ఆప్రాన్స్, చెప్పులు, గ్లౌజులు మరియు టవల్స్ ఉన్నాయి.పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర విధుల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పీపీఈ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని కమిషనర్ చెన్నబోయిన నాగరాజు సూచించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ నన్నెపంగ శ్రీనివాస్, 9వ వార్డు కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, 11వ వార్డు కౌన్సిలర్ షేక్ షహనాజ్, 13వ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి లక్ష్మయ్య, కో-ఆప్షన్ సభ్యురాలు షేక్ మొగలాబీ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తకు కష్టం వచ్చిందంటే పీజీఆర్‌దే తొలి అడుగు!

**ఆపదలో ఉన్న కార్యకర్తను పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్**

**గుర్రంపోడు: అక్టోబర్ 18 (జనంసాక్షి)**

గుర్రంపోడు: కార్యకర్తకు ఆపద వచ్చిందంటే చాలు.. వెంటనే స్పందించి అండగా నిలిచే నాయకుడిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీజీఆర్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గుర్రంపోడు మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన తన కార్యకర్త జాల మల్లేష్ ఆపదలో ఉన్న విషయం తెలుసుకున్న పీజీఆర్, ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్వయంగా గ్రామానికి చేరుకున్నారు. మల్లేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం మల్లేష్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తమ నాయకుడు స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడంతో మల్లేష్ కుటుంబ సభ్యుల్లో ధైర్యం నిండింది.

**కార్యకర్తలే నా బలం.నా కుటుంబం**

ఈ సందర్భంగా పీజీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తలు తనకు కేవలం రాజకీయ సహచరులు మాత్రమే కాదని, తన కుటుంబ సభ్యులతో సమానమని అన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను చూస్తూ ఊరుకోబోనని స్పష్టం చేశారు. పదవిలో ఉన్నా.. లేకున్నా.. కార్యకర్త ఆపదలో ఉన్న విషయం తెలిసిన వెంటనే వారి వద్దకు చేరుకుని అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తానని తెలిపారు. కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటానని,



వారికి ఏ సమయంలోనైనా అండగా నిలుస్తానని పీజీఆర్ స్పష్టం చేశారు. నాయకుడంటే కేవలం రాజకీయాల్లో ముందుండటం కాదని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలవడమే నిజమైన నాయకత్వమని ఆయన చాటిచెప్పారు. పీజీఆర్ చూపిన ఆప్యాయత, భరోసాతో మల్లేష్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పోచంపల్లి మాజీ సర్పంచ్ మల్లేష్, కుర్మాల్ రెడ్డి, భాస్కర్, కృష్ణయ్య, పవన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# శాంతియుతంగా దసరా జరుపుకోవాలి

**అర్వపల్లి ఎస్ఐ పి.మధు**

జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబర్ 18( జనంసాక్షి) :**

విజయదశమి వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని అర్వపల్లి ఎస్ఐ పి.మధు పిలుపునిచ్చారు. ఆదివారం పర్సాయపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దసరా పండుగ నిర్వహణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... పండుగ వాతావరణాన్ని దెబ్బతీస్తూ ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ బానోతు సైదులు, ఉపసర్పంచ్ కె. రామదాసు, పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిమ్మాపురంలోని సూర్య దేవాలయంలో సౌర హోమం, ప్రత్యేక పూజలు

జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబర్ 18( జనంసాక్షి) :**



జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్య నారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు.?అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకులు కాకులారపు రజితజనార్ధన్‌స్వామి, గణపురం నరేష్, అర్చకులు భీంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

# జాజిరెడ్డిగూడెంలో మహిళలకు చీరల పంపిణీ

జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబర్ 18( జనంసాక్షి) :**

జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దేవి నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు, మహిళలకు చీరలను గ్రామానికి చెందిన గుడిపల్లి రాధికారెడ్డి ఆదివారం పంపిణీచేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము విజయ్, కూరం రాంబాబు, గిరిబాబు, శివ, లాలయ్య , శ్రీను, మధు, శంకర్, సుమన్, నవదీప్ కాలనీవాసులు పాల్గొన్నారు.



# దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

జాజిరెడ్డిగూడెం మండల **అక్టోబర్ 18( జనంసాక్షి) :**



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొమ్మాల గ్రామంలో శ్రీ దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దివ్య మంగళ స్వరూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు కనులపండువగా నిర్వహించారు. కొమ్మాల గ్రామంలోని బొడ్రాయి విగ్రహం వద్ద అర్చకులు, భక్తులు ప్రత్యేకంగా హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# సిరిపురపు కుటుంబ ఆత్మీయ సమ్మేళనం

## - సంతోషంతో ఒకచోటకు చేరిన రక్త బంధువులు

**కామేపల్లి అక్టోబర్ 18 జనంసాక్షి :**
మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన సిరిపురపు చిన్న భద్రయ్య- లక్ష్మమ్మ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ముచ్చర్ల గ్రామంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్లో వైభవంగా ఆదివారం నిర్వహించారు. స్వర్గస్తులైన చిన్న భద్రయ్య - లక్ష్మమ్మ చిత్రపటాలకు రక్తసంబంధికులు ఘనంగా నివాళు లు అర్పించారు. చిన్న భద్రయ్య - లక్ష్మమ్మ కు ఇద్దరు కుమారులు ఆరుగురు కుమార్తెలు ఉండగా వీరందరూ సంతానం 192 మంది ఉండడంతో రక్త సంబంధీకులు అంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. ఒకరి కుటుంబ మంచి చెడులను మరొకరు పంచుకుంటు ఆనందం వ్యక్తం చేసుకున్నారు. దీంతో వారి కుటుంబాల్లో పండగ వాతావరణం చోటు చేసుకుంది. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి బతుకమ్మ ఆటలు ఆడారు. పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ సమయం గడిపారు. ఈ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం చూసిన గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సిరిపురపు కిషోర్, మాధవరావు, రవికుమార్, పుల్లయ్య, శ్రీనివాసరావు, చంద్ర వెంకటేశ్వర్లు, గుండ పిన్ని పుల్లారావు, కొప్పుల అప్పారావు, శ్రీనివాసరావు, మోతుకూరి విజయలక్ష్మి, పొన్నెకంటి సత్యనారాయణ, బొల్లు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన సంతోషిమాత

**సూర్యాపేట (జనంసాక్షి):**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో అమ్మవారు ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శన మిచ్చింది. దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భవాని దీక్ష మాతలకు దీక్షా పూజలతో పాటు చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించారు.శ్రీదుర్గాదేవి అలంకారం చేయించిన భక్తులకు సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.శ్రీచక్ర యంత్రానికి ప్రత్యేక పూజలు, బ్రాహ్మణ ముత్తైదువకు సుహాసిని పూజతో పాటు మంత్రపుష్పాలతో అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు.మహిళలు సామూహికంగా సౌందర్యలహరి, శివానందలహరి, లలితా పారాయణం చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్,ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశ రావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, ఉత్సవ కన్వీనర్ గోపారపు రాజు, ఉపాధ్యక్షులు సోమా శ్రీశైలం, సహాయ కార్యదర్శి యమా వెంకటేశ్వర్లు, యానాల వెంకటరెడ్డి , గుండా కృష్ణ, గజ్జి నాగేందర్ , కొల్లూరు మాల్యాద్రి, కంచర్ల లీల,అర్చకులు అశోక్ మిశ్రా, రాఘవా చార్యులు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాలాజీ రెండోసారి ఎన్నిక

**కామేపల్లి, అక్టోబర్ 18 జనంసాక్షి:**
పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండల పరిధిలోని టేకుల తండా గ్రామానికి చెందిన కామేపల్లి హై స్కూల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు లకావతు బాలాజీ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ తన ప్రత్యేకను కనబరచడంతో పి ఆర్ టీయు సంఘం గుర్తించి ఉపాధ్యక్షులుగా నియమించారు. ఆయనతోపాటు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా కొత్త లింగాల పాఠశాలకు చెందిన మాలిక నియమితులయ్యారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు మండల అధ్యక్ష కార్యదర్శులు పిట్టల రాములు వెంకన్నలు అభినందించారు. సంఘ అభివృద్ధికి శక్తివంతం లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు.





# నాయకన్ గూడెంలో మహా అన్నదాన కార్యక్రమం

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కందాల

### మాజీ సర్పంచ్ కాసాని సైదులు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం పాల్గొన్న పలువురు నేతలు..

**కూసుమంచి, అక్టోబర్ 18 ( జనంసాక్షి ) :**
మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో బస్టాండ్ కూడలి వద్ద శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా సందర్భంగా దేవీ నవరాత్రుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తూ ఆదివారం రోజున మాజీ బిఆర్ఎస్ సర్పంచ్ మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా దానికి ముఖ్య అతిథిగా పాలేరు మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు ఆయనను కోలాట నృత్యాలు డిజె సౌండ్ తో భారీ ప్రదర్శనగా ఎదురు వెళ్లి ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ దుర్గాదేవి మండపం వరకు తోడుకొని వచ్చి ఆయనతోణ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేయించి అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారుఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ జిల్లా నాయకులు మలీదు వెంకటేశ్వరరావు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వేముల వీరన్న వివిధ గ్రామాలకు సంబంధించిన మాజీ సర్పంచ్ లు పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం

**చింతలపాలెం(జనంసాక్షి)**
చింతలపాలెం మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ నందు పట్ట భద్రుల ఓటర్ నమోదు స్టాల్ ను హుజూర్నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.అనంతరం రఘు మాట్లాడుతూ నల్లగొండ- ఖమ్మం- వరంగల్ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున డిగ్రీ పూర్తి అయిన అభ్యర్థులు అందరూ తమ ఓటు కోసం నవంబర్ ఆరో తారీకు లోపల దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు.ఓటు నమోదు చేసుకోవలసిన అభ్యర్థులు స్టాల్ నందు ఫ్రీగా నమోదు చేయబడు తుంది అని తెలిపారు.కావున దయ చేసి అందరూ తమ ఓటును నమోదు చేయవలసిందిగా కోరారు.ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ కందుల రామ కోటిరెడ్డి,గుడిమల్కాపురం ఉపసర్పంచ్ మేడిశెట్టి నరసింహారావు,సోమ వెంకటే శ్వర్లు,జంగాల పుల్లయ్య,ఎమ్మార్పీఎస్ నాయకులు రామ ప్రభాకర్,చింతలపా లెం గ్రామ బిఆర్ఎస్ నాయకులు పల్లె రమేష్ రెడ్డి,షబిల్,ముక్కంటి రెడ్డి,పొల్లా ఆది,వెంకట్,రియాజ్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న జయంతి పోస్టర్ ఆవిష్కరణ

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 18 (జనం సాక్షి):**
తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన ప్రజావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న జయంతి వేడుకలకు బీసీ సంఘాల నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు, విద్యార్థులు, మహిళలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.పండుగ సాయన్న విగ్రహ స్థాపన కమిటీ నల్లగొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు నల్ల సోమ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొల్ల వెంకట్ ముదిరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ లోకనబోయిన రమణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గుమ్మల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నల్ల సోమ మల్లయ్య మాట్లాడుతూ నిజాం పాలనలో జాగీర్దారులు, జమిందారుల దోపిడీకి గురైన బహుజన వర్గాలకు పండుగ సాయన్న అండగా నిలిచారని పేర్కొన్నారు. పేదలకు ఆహారం, ఆశ్రయం కల్పిస్తూ, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా ఆయన గుర్తింపు పొందారని



అన్నారు. ఆయనను అణచివేసేందుకు అప్పటి పాలకులు కుట్రలు పన్ని శిక్షించారని, ఆయన మరణం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించిందని వివరించారు.కేశబోయిన శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలిచిన సేవల కారణంగా పండుగ సాయన్న తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ బొల్ల వెంకట్ ముదిరాజ్ మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.లోకనబోయిన రమణ ముదిరాజ్ మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో పండుగ సాయన్న విగ్రహంతో పాటు తెలంగాణ తొలి అమరుడిగా పేర్కొనే పోలీసు కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయంలో జరిగే అధికారిక జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు అల్లి సుభాష్ యాదవ్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, రేగట్టె అండాలు, లింగస్వామి గౌడ్, సంఘం ఉపాధ్యక్షుడు దుద్దు కృష్ణమూర్తి ముదిరాజ్, చింతకాయల పుల్లయ్య ముదిరాజ్, చందనబోయిన వెంకన్న ముదిరాజ్, భైరవైన బిక్షం ముదిరాజ్, బైరి బలరాం ముదిరాజ్, కోట్ల సునీత ముదిరాజ్, సిద్ధం వెంకన్న ముదిరాజ్, పంగా పాండు ముదిరాజ్, సింగారం మల్లయ్య ముదిరాజ్, మెరుగు సర్వయ్య ముదిరాజ్, చాగంటి రాములు ముదిరాజ్, బైరి సుదర్శన్ ముదిరాజ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

**మర్రిగూడ, అక్టోబర్18 (జనం సాక్షి)**



దసరా పండుగను పురస్కరించుకొని యరగండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందిని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నారోజు కుమారస్వామి ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని కుమారస్వామి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్మిక విభాగం మర్రిగూడ మండల అధ్యక్షుడు పంగా యాదయ్య యాదవ్, బూత్ అధ్యక్షులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# 25 అవార్డులతో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఘన విజయం

## ఖమ్మం జిల్లాలో అత్యధిక అవార్డులు సాధించి ప్రత్యేక గుర్తింపు

**భద్రాచలం అక్టోబరు 18 (జనంసాక్షి)**

సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తూ ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం మరో ఘనతను సాధించింది. 2025?26 సంవత్సరంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా లయన్స్ ఇంటర్నేషనల్ 320ఈ ఎక్సెల్ అవార్డుల వేడుకల్లో మొత్తం 25 అవార్డులను కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాలో అత్యధిక అవార్డులు సాధించిన క్లబ్‌గా గుర్తింపు పొందింది. మిల్స్ ఆన్ వీల్స్ విభాగంలో ఉత్తమ సేవా అవార్డును లయన్ మోర్తాల సిద్ధారెడ్డి, లయన్ పవన్ గుడికందుల, లయన్ అనుగోజి నరసింహాచారి అందుకున్నారు. అత్యుత్తమ సేవా అవార్డులను లయన్ భీమవరపు వెంకటరెడ్డి, లయన్ పి. దేశప్పు, లయన్ జి. శివశంకర్, లయన్ చావ లక్ష్మీనారాయణ సాధించారు.

**- సేవే లక్ష్యంగా మరిన్ని కార్యక్రమాలు.**



ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, 25 అవార్డులు లభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ విజయాన్ని వ్యక్తిగత ఘనతగా కాకుండా సభ్యులందరి ఐకమత్యానికి, సమష్టి కృషికి లభించిన గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు సహాయం అందించడం, విద్యారంగాన్ని ప్రోత్సహించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతతో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. అవార్డులు తమ బాధ్యతను మరింత పెంచాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. క్లబ్ సాధించిన విజయంపై సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# రాజాపురంలో కనకదుర్గమ్మ మండపం వద్ద మహా అన్నదానం

**○దసరా వేడుకల్లో భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం**

**○సుమారు 700 మందికి అన్నప్రసాద వితరణ**

**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 18 (జనంసాక్షి)**



దసరా పండుగ సందర్భంగా రాజాపురం గ్రామంలోని మేదర్ బజార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గమ్మ మండపం వద్ద ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి హాజరయ్యారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం హోమం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సుమారు 700 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. పండుగ వేళ నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం గ్రామంలో భక్తిభావాన్ని, ఐకమత్యాన్ని చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో ముద్దుమూరి సోమయ్య, వెంకటలక్ష్మి, చెన్నారావు, కొండ సతీష్, నందిని, నరేష్, సోని, పుల్లారావు, లక్ష్మణ్, విజయ, నాగేశ్వరరావు, రూప, పల్లవి, హేమ, ఉమ, నవ్య, లక్ష్మి, నర్మద, జోషిత్, సంధ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.



# మాజీమంత్రి జగదీష్ రెడ్డిని ఆహ్వానించిన దేవాలయ కమిటీ సభ్యులు

**సూర్యాపేట (జనంసాక్షి):**

ఈ నెల 20న విజయదశమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల జిల్లా పరిషత్ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు సూర్యాపేట మున్సిపాలిటీ సహకారంతో శ్రీసంతోషి మాత దేవాలయం ఆధ్వర్యంలో జరిగే శమీ పూజ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి,సునీత దంపతులకు సంతోషిమాత దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాష్ రావు, ఉత్సవ కన్వీనర్ గోపారపు రాజు, ఉపాధ్యక్షులు బెలిదే అశోక్, గుండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాష్టమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో గోదావరి నదీ హారతి

**○ లోకకల్యాణం కోసం భద్రాద్రిలో ప్రత్యేక పూజలు**

**○ గోదావరి పుష్కరాల నుంచి ప్రతిరోజూ హారతి నిర్వహించాలన్నది భక్తుల ఆకాంక్ష**



**భద్రాచలం అక్టోబర్ 18 (జనంసాక్షి)**

దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో పవిత్ర గోదావరి మాతకు ఆదివారం భక్తిశ్రద్ధలతో నదీ హారతి నిర్వహించారు. లోకకల్యాణం, ప్రజల ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధిని కాంక్షిస్తూ భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ, గత జిల్లా కలెక్టర్ చొరవతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ప్రారంభమైన గోదావరి నదీ హారతి కార్యక్రమం ఏడాది కాలానికి చేరువైందన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రీతిపాత్రమైన ఆదివారం రోజున ప్రతి వారం క్రమం తప్పకుండా హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచభూతాల్లో నీరు అత్యంత ప్రాధాన్యమైనదని, ప్రజల జీవనానికి ఆధారంగా నిలిచే నదులను పూజించడం భారతీయ సంస్కృతిలో అనాదిగా వస్తున్న సంప్రదాయమని పేర్కొన్నారు. గౌతమ మహర్షి తపశ్శక్తి ఫలితంగా ఆవిర్భవించిన గోదావరి నదికి అఖండ గౌతమి అనే పేరు కూడా ఉందన్నారు. ప్రజలకు జీవనాధారమైన పవిత్ర నదిని పూజించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. దుర్గాష్టమి సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక హారతులు సమర్పించినట్లు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న గోదావరి నదీ హారతిని గోదావరి పుష్కరాల నుంచి ప్రతి రోజూ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. అధి, కారులు, స్వచ్ఛంద సంస్థలు, భక్తుల సహకారంతో దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలంలో గోదావరి మాతకు నిత్యం హారతులు సమర్పించే సంకల్పం నెర వేరాలని స్వామివారిని ప్రార్థించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ మొర్ల ఎర్రయ్యరెడ్డి తనయుడు మురళి రమేష్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. హారతికి హాజరైన భక్తులకు రామవజ్జల రవికుమార్?లక్ష్మి దంపతులు, పీవీఎం రెడ్డి దంపతులు సమర్పించిన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్ శర్మ, సుబ్రహ్మణ్యాచార్యులు, శ్రీరామ్ శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ, రామాచార్యులు, తేజశర్మ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అన్నదానం.. అభినందనీయం

**○ఆధ్యాత్మిక వేడుకలు ఐక్యతకు ప్రతీకలు: తుంబూరు దయాకర్ రెడ్డి**

**○నాలుగో వార్డులో శ్రీ దుర్గా పరమేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం**

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 18 (జనంసాక్షి)**



భక్తిశ్రద్ధలతో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ, అన్నదానంతో సేవాభావాన్ని చాటడం అభినందనీయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో శ్రీ దుర్గా పరమేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు దయాకర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను సామూహిక భాగస్వామ్యంతో నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు.ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాలను ఎంతటి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారో, నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అదే స్ఫూర్తితో ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.

కాంగ్రెస్ యువజన నాయకుడు బోయిన సాయి యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలను సమన్వయం చేస్తూ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంపై దయాకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్ బోయిన కుమారి, కాంగ్రెస్ నాయకుడు బోయిన సంగయ్య, శ్రీ దుర్గా పరమేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రగ్బీలో సత్తా చాటిన గిరి జగదీశ్

**అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో ర్యాంక్.. గుర్రంపోడు మండలానికి గర్వకారణం**



**గుర్రంపోడు: అక్టోబర్ 18 (జనంసాక్షి)**

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలం ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన గిరి జగదీశ్ రగ్బీ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. కొలిముకుందుల పాడు గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరి జగదీశ్ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని అండర్?14 రగ్బీ టోర్నమెంట్‌లో పాల్గొని ఈ ఘనత సాధించాడు. 2026?27 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రెండో ర్యాంక్ సాధించడం పట్ల గ్రామస్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాసు గిరి జగదీశ్‌ను అభినందించి, అతడికి ప్రోత్సాహం అందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది విద్యార్థులు క్రీడల్లో రాణించే అవకాశం ఉందని, యువత చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.గిరి జగదీశ్ సాధించిన విజయం గ్రామంలోని ఇతర యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని, అతడిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది విద్యార్థులు క్రీడల్లో ముందుకు రావాలని బచ్చనబోయిన శ్రీనివాసు పేర్కొన్నారు.

# వైద్య సాంకేతిక విద్యలను అభ్యసిస్తున్న పేద విద్యార్థిని విద్యార్థులకు కొండబోలు సురేష్ ఆర్థిక సహాయం

వైరా జనం సాక్షి
అక్టోబర్ 18న వైరా మరియు పరిసర ప్రాంతాలకు చెందిన వైద్య విద్య, సాంకేతిక విద్యలు అభ్యసిస్తున్న 17 మంది విద్యార్థిని విద్యార్థులకు సోమవరం గ్రామానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయులు కొండబో లు సురేష్ వారి సోదరి కొండబోలు లలిత 2 లక్షల పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైరా గుట్ట బడి ప్రాథమిక పాఠశాల యందు వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా ఏసిపి సారంగపాణి వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి కాపా చంద్రకళ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అందజేసినారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏసీబీ సారంగపాణి మాట్లాడుతూ విద్య బోలు ధనం వృద్ధి లో లేదని విద్య ద్వారా వినయం, ఉన్నత స్థితి లభిస్తుందని వైరా ప్రాంతంలోని వైద్య విద్యను అభ్యసిస్తున్న ఎనిమిది మంది విద్యార్థిని విద్యార్థులకు 15 వేల రూపాయలు చొప్పున సాంకేతిక విద్యను అభ్య సిస్తున్న 9 మంది విద్యార్థిని విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున మొత్తం 2 లక్షల పదివేల రూపాయలను అందజేస్తూ ఆయన మాట్లాడినారు. వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాప చంద్రకళ మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో గొప్పదని వైద్యులకు ఓపిక అవసరమని, వ్యసనాలకు దూరంగా ఉంటూ వైద్య విద్య ను కష్టంతో ఇష్టంగా అభ్యసిస్తూ వైద్యునిగా మంచి పేరు తెచ్చుకోవాలని వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది అని ఈ ఖర్చులకు గాను కొండబోలు సురేషు మరియు లలిత గార్లు ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని సమాజానికి మంచి పరిణామం అని ఆమె కొనియాడినారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీమతి ముళ్ళపాటి విజయలక్ష్మి, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వార్డు కౌన్సిలర్ ఫణిత సైదులు, ముళ్ళపాటి సీతారాములు, ఉంద్రు శ్యాంబాబు, సోమవరం గ్రామస్తులు బెజవాడ వీరభద్రనీ స్థానిక పాఠశాల హెచ్.ఎం శ్రీనివాసచారి, ఉపాధ్యాయసంఘాల బాధ్యులు గూడపాటి సూర్యం, పెనుగొండ ఉపేంద్రరావు, పాలపర్తి భాస్కర్, దొడ్డ వరప్రసాద్, వైరా సబ్ ఇన్స్పెక్టర్ పుష్పాల రామారావు, తోటకూర రఘు, పొదిల హరినాథ్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.






## ఓ వ్యక్తిపై తేనెటీగల దాడి

పెద్దపల్లి అక్టోబర్ 18 (జనం సాక్షి)
పెనుబల్లి మండల ఉప్పభ్యులు చిమట విశ్వనాథంపై ఆదివారం తేనెటీగలు దాడి చేశాయి. భవనపాలెం సమీపాన రహదారిపై వస్తున్న సమయంలో ఉన్నట్టుండి తేనెటీగలగుంపు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యనీ చేయించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మండల కమిటీ సభ్యులు చిట్టి మోదుల కృష్ణయ్య పరామర్శించారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

వలిగొండ, అక్టోబర్ 18(జనం సాక్షి)
తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ చివరి రోజు మండలం లోని సాయి నగర్ కాలనీ లో వేడుకలు మహిళల ఆటపాటలతో సందడిగా సాగాయి. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు.పూల అందాలు, మహిళల సందడి, చిన్నారుల ఉత్సాహంతో పండుగ వాతావరణం నెలకొంది. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. చివరి రోజు వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాయి.



## హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతల లక్ష్మీనారాయణ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి

### కుటుంబానికి న్యాయం చేయాలి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి: పద్మశాలి సంఘం డిమాండ్



కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్18 (జనం సాక్షి):
హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ క్రీస్తుశేషులు అనంతల లక్ష్మీనారాయణ ఆత్మహత్య ఘటనపై పద్మశాలి సంఘం తీవ్రగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణను వేగవంతం చేయాలని, అనంతల లక్ష్మీనారాయణకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విధుల నిర్వహణలో ఆయనపై వేధింపులు జరిగాయా? మానసిక ఒత్తిడికి గురిచేసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంత లక్ష్మీ నారాయణ హెచ్‌పీ గ్యాస్ కంపెనీకి ఎంతో నిబద్ధతతో సేవలందించిన ఉత్తమ ఉద్యోగి అని పద్మశాలి సంఘం నాయకులు గుర్తుచేశారు. కరోనా మహమ్మారి సమయంలో, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భాల్లో, యుద్ధ పరిస్థితుల ప్రభావం ఉన్న సమయంలోనూ వినియోగదారులకు ఇబ్బం దులు కలగకుండా సేవలందించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ యాజ మాన్యం కూడా అంతర్గత విచారణను నిష్పాక్షికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, కుటుం బంలోని ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం చర్యలు తీసు కోవాలని కోరారు. అనంతల లక్ష్మీ నారాయణపై వేధింపులు జరిగినట్లు విచారణలో తేలితే, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు అనంతల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసి, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ పద్మశాలి సంఘం, ఉద్యోగ సంఘాల నాయకులు అధ్యక్షుడు ఆడేపు రమాకాంత్, ఎర్రగుంట సాంబశివరావు, గుగ్గిళ్ల రామ్మూర్తి, ఆర్ఎంపీ డాక్టర్ మారయ్య, గుండు రవి, దోమల కిషోర్, మనుపురి ప్రభాకర్, దోమల ప్రవీణ్, పిండిపోలు కన్నయ్య, పెగుడ శంకర్, వెంకటేశ్వర్లు, మేకల కిరణ్, రామ్మోహన్, రాందాస్, వెలదండి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడిన యోధుడు గంగవరపు విజయ్ కుమార్

### ఘనంగా సీపీఐ నేత 27వ వర్ధంతి.. విగ్రహానికి నేతల నివాళులు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 18:(జనం సాక్షి )
పేద ప్రజల హక్కుల సాధన కోసం ఎర్రజెండా చేతబట్టి పోరాడిన కమ్యూనిస్టు యోధుడు గంగవరపు విజయ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సీపీఐ దివంగత నేత గంగవరపు విజయ్ 27వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మౌలానా, దండి సురేష్ మాట్లాడుతూ.. రజాకారుల ప్రభావం బలంగా ఉన్న రోజుల్లో కమ్యూనిస్టు ఉద్యమంపై తీవ్ర నిర్బంధాలు కొనసాగినప్పటికీ, విజయ్ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ధైర్యసాహసాలతో ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. పేదలు, కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల



కంటే ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యమిచ్చిన ఆయన జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శమని పేర్కొన్నారు.గంగవరపు విజయ్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధించే దిశగా యువత ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మెడకంటి చిన్న వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బానోతు రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, వీరభద్రం, బుర్ర నాగేశ్వరరావు, ఉన్నం రంగారావు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, 32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఖమ్మం మండల సమితి సభ్యులు ఏలూరి భాస్కర్, బానోతు జగన్, బట్ట బాబు, వెన్నం భాస్కర్, గోకినపల్లి రామ్మూర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్, ఏఐఎస్ఎఫ్ సభ్యుడు సాయి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్య ఆలయానికి ఐదు వీల్‌చైర్ల విరాళం

### - వృద్ధులు, దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ సేవా కార్యక్రమం



భద్రాచలం అక్టోబర్ 18 (జనంసాక్షి)
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదు చక్రాల కుర్చీలను ఆదివారం విరాళంగా అందజేశారు. రూ.25 వేల విలువైన ఈ కుర్చీలను ఆలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగ భక్తులు సులభంగా స్వామివారిని దర్శించుకునేందుకు ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.దామోదర్‌రావు మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ సభ్యులు ముందుకొచ్చి చక్రాల కుర్చీలను విరాళంగా అందించడం అభినందనీయ మన్నారు. ఈ కుర్చీలు వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సామాజిక సేవలో భాగంగా ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ అజీమ్, కార్యదర్శి పాపినేని శ్రీనాథ్ రాజేష్, ప్రతినిధులు యశోద రాంబాబు, అజయ్‌కుమార్, ప్రభాకర్ గుప్తా, దారా బాలాజీ, రాజారెడ్డి, వాసిరెడ్డి సాంబశివరావు, శ్రీనివాస్‌రెడ్డి, చలపతి, శంకర్‌రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు. అలాగే దేవస్థాన సిబ్బంది శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

### కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో జస్టిస్ సూరేపల్లి నందా

**భద్రాచలం అక్టోబర్ 18 (జనంసాక్షి)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. దామోదర్‌రావుతో పాటు వైదిక, పరిపాలన సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జస్టిస్ నందా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యం, విశిష్టతలను వైదిక బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. పూజల అనంతరం వైదిక బృందం ఆయనకు వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం తరపున ఈవో కె. దామోదర్‌రావు తీర్థప్రసాదాలను అందజేశారు.






# తొలగించిన 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలి

### నెల 23న దేశవ్యాప్త ఉద్యమం: బి.వెంకట్

**భద్రాచలం అక్టోబర్ 18 (జనంసాక్షి)**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను రద్దు చేయాలని, తొలగించిన 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఓటు చోరీ ఆరోపణలపై ఈ నెల 23న దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. భద్రాచలంలోని చంద్రరావు భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితాల నుంచి మైనార్టీలు, దళితులు, గిరిజనులు, పేదల ఓట్లు అధికంగా తొలగించారని ఆరోపించారు. అర్హుల ఓటు హక్కును కాపాడాలని, ఎన్నికల కమిషన్ తీరుపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వర్షాభావంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి కరువైందని, ప్రభుత్వాలు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఓటు హక్కు పరిరక్షణతోపాటు ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బి.నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బండారు శరత్‌బాబు, డి.సీతాలక్ష్మి, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ : కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ

**ఖమ్మం , అక్టోబర్ 18 (జనంసాక్షి)**



ఖమ్మం నగరంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ బతుకమ్మను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య మహిళలతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేకమైన విశిష్టత ఉందని అన్నారు. తరతరాలుగా వస్తున్న మన సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు.

# ఎస్సై విజయకుమారిని కలిసిన అంబేద్కర్ యువజన సంఘం, బీజేపీ నాయకులు

**చంద్రుగొండ, అక్టోబర్ 18 (జనంసాక్షి):**





చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై డి. విజయకుమారిని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించి, ఎస్సైగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం బాధ్యులు ఇల్లంగి బాలకృష్ణ, తలారి నాగరాజ్, మిరియాల మోహన్‌రావు, మద్దాల క్రాంతి కుమార్, భాష్యం రాజు, తంబళ్ల పుల్లారావు, తంబళ్ల వంశీ, బడుగు నరేష్, రాయ్ రాజా, బడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ మండల అధ్యక్షుడు నల్లమోతు రఘుపతిరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాజేష్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు కుక్కడపు రామారావు, వార్డు సభ్యుడు తేజావత్ బాబు, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చిన్నం సురేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సతీష్, బీజేపీ నాయకులు వీరప్పనేని సతీష్, నరసపుత్ర వందనం, పసుపులేటి శీను తదితరులు ఎస్సై విజయకుమారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఖమ్మంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 18 ( జనంసాక్షి)**



ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ సారధి నగర్‌లో బతుకమ్మ సంబరాలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ 48వ డివిజన్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సుమారు 600 బతుకమ్మలతో మహిళలు పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు×. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న భక్తురాళ్లకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని అల్లే సాయికిరణ్, రూపాదేవి దంపతులు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నగర అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.కె. ఖాదర్ బాబా, కాంగ్రెస్ జిల్లా నాయకులు కమ్మర్తపు మురళి హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు×. ఈ సందర్భంగా వారు మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర నాయకులు బాణాల లక్ష్మణ్, బోజట్ల సత్యనారాయణ, ప్రసన్న కుమార్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

# బిటిపిఎస్‌లో దసరా శోభ

### మహిళా కార్మికులకు చీరల పంపిణీ

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 18 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బిటిపిఎస్) కార్మికుల పట్ల కార్మిక సంఘ నాయకులు తమ ఉదారతను చాటు కుంటున్నారు. దసరా పండుగను పురస్కరించుకుని సివిల్ సర్కిల్-2 ఆధ్వర్యంలో ఆదివారం దుర్గా అమ్మవారి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా కార్మిక సంఘం-1535 రీజనల్ వైస్ ప్రెసిడెంట్ కొత్త జాన్ రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సర్కిల్‌లో విధులు నిర్మిస్తున్న 25 మంది మహిళా కాంట్రాక్టు కార్మికులకు సొంత ఖర్చులతో ఉచితంగా చీరలు, జాకెట్లను పంపిణీ చేసి వారిలో దసరా పండుగ ఆనందాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్కిల్-1 ఎస్ఈ (ఇఇ) రాంప్రసాద్ దంపతులు ముఖ్య అతితులుగా పాల్గొని మహిళా కార్మికులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ రాంప్రసాద్ మాట్లాడుతూ.. పండుగ వేళ కార్మికులను సంతోషపెట్టేలా జాన్ రెడ్డి ముందుకు రావడం అభినందనీయమని, ఆయన దాతృత్వాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ) దాసుతో పాటు పలువురు కర్మాగార ఉద్యోగాలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన లక్ష్మితాయారు

**భద్రాచలం అక్టోబర్ 18 (జనంసాక్షి)**



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీతాయారు అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సకల సంపదలు, సౌభాగ్యాలను ప్రసాదించే తల్లిగా కొలిచే అమ్మవారిని విశేషంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో అలరారింది. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.

# సంతోష్ మృతి పట్ల హకీమ్ బృందం సంతాపం

ఖమ్మం, అక్టోబర్ 18 (జనంసాక్షి)

ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న సంతోష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడం పట్ల తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, ఎండి అబ్దుల్ హకీమ్, తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, మిత్రులతో కలిసి సంతోష్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. స్నేహపూర్వకంగా అందరితో కలిసి సంచరించే సంతోష్ అనారోగ్య కారణంగా మన మధ్యన లేకపోవడం విచారకరం అన్నారు. సంతోష్ మృతి పట్ల సంఘం నాయకులు విచారం వ్యక్తం చేస్తూ, ఆయన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు ఎం.డి. అబ్దుల్ హకీమ్, ఎం. బాబురావు, అబ్దుల్ రెహమాన్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.